*‘జాగృతి’ – దీపావళి ప్రత్యేక సంచిక (1996)*

# నే యియౌ నే తేస్తా

“వచ్చినట్లే లేదు. అప్పుడే వెళ్ళిపోతున్నారు. వస్తారు, వస్తారు అనుకున్నంతసేపు పట్టలేదు. రావడం, వెళ్ళడం కూడా అయిపోతున్నాయి”

“నాకూ అలానే ఉంది. పెళ్ళయి ఇక్కడ నుండి వెళ్ళినప్పటి నుండి ఎదురు చూస్తున్నాను – దసరా పండక్కి ఇంటికి రావచ్చునని. నాలుగు నెలలు ఎదురు చూస్తే, వారం రోజులు నాలుగు క్షణాల్లా అయిపోయాయి. వెళ్ళాలంటే నాకూ బెంగగా ఉంది.”

“నాకు తెలీదా ఏంటి, ఈ బెంగ? అది కాదు కానీ, మీరు ఇంకో రెండు రోజులుండి వెళ్ళకూడదూ?”

“కుదరదమ్మా, ఆయన బయల్దేరుతున్నప్పుడే చెప్పారు. రేపు డ్యూటీలో చేరిపోతానని – ఆగడం కుదరదు”

“పోనీ, ఇంకోసారి అడుగరాదూ?”

"అడుగుతాను, ఇంకో రెండు రోజులుండగలిగితే, నాకూ బావుంటుంది. అడిగి చూస్తాను. ఆయన సరేనంటే ఆనందమే."

"లేస్తున్నట్లున్నాడు. ఏమైనా కావాలేమో కనుక్కో"

❋ ❋ ❋

"ఏమండీ!"

"ఊ–"

"లేచారా?"

"ఇప్పుడే లేస్తున్నాను"

"ఇవిగో, మంచినీళ్ళు"

"….."

"ఏమైనా తింటారా?"

"మధ్యాహ్నం తిన్న అన్నమే ఇంకా అరగలేదు. ఇప్పుడింక ఏమీ తినలేను"

"ఏమండీ–"

"ఊ–"

"మీరు రేపు డ్యూటీలో చేరి తీరాలా అని అమ్మ అడగమంది"

"అత్తయ్య అడగమందా – నువ్వే అడుగుతున్నావా?"

"అమ్మతోడు – అమ్మే అడగమంది"

"చేరి తీరాలని ముందే చెప్పానుగా. ఆ మాటే చెప్పాల్సింది"

"నేను చెప్పాను. అయినా కుదురుతుందేమోనని కాస్త కనుక్కోమంది. పోనీ రెండు రోజులుండి వెళ్ళవచ్చుగా అంది"

"అదేమీ కుదరదు కానీ – కాస్త కాఫీ తీసుకురా"

❋ ❋ ❋

"ఏమన్నాడే, అల్లుడు?"

"కుదరదన్నారమ్మా, వెళ్ళి తీరాలట"

"తప్పదన్నమాట"

"తప్పదన్నారు. రాములమ్మ జున్నుపాలు తెస్తానంది దానికింకా కుదిరినట్లు లేదు. నాకు తినే యోగం లేదన్నమాట"

"అది కనిపించి మరీ చెప్పింది – అమ్మాయిగారు వెళ్ళేలోగా తెస్తానని"

"ఆదిలక్ష్మి సీతాఫలాలు తేలేదు. పండుగ రోజులు దానికీ తీరిక ఉండి ఉండదు. రేపో, ఎల్లుండో తెస్తుందేమో"

"అందుకేగా రెండు రోజులుండి వెళ్ళమంటున్నాను. నువ్వేమో కుదరదంటున్నావు"

"కుదరనిది నాకు కాదు, మీ అల్లుడికి"

"పోనీ, నువ్వుండరాదూ రెండు రోజులు?"

"రెండు రోజులేం – నువ్వు దీపావళి వరకు ఉండమంటావు"

"ఏం ఉండకూడదా? – ఇది నీ ఇల్లు కాదా?"

"నాకూ ఉండాలనే ఉంది. దసరా సరదా పండగే. అంతకన్నా సంబరాల పండగ దీపావళి. దీపావళికి ఆ పక్కింటి శారదా, ఈ పక్కింటి సరస్వతీ కూడా వస్తారట. అందరం దీపాలు వెలిగించుకుని చిచ్చుబుడ్లు కాల్చుకోవచ్చు"

"అల్లుడితో చెప్పు – ఉండిపో"



"ఉండు – కాఫీ ఇచ్చి వస్తాను"

❁ ❁ ❁

"కాఫీ నువ్వు చేసావా? అత్తయ్యా?"

"కాఫీ బావుందా? లేదా?"



"బావుంది. నువ్వు చేసి ఉండవు"

"అమ్మే చేసింది"

"రేపటి నుండి ఈ కాఫీ యోగం ఉండదు నాకు"

"అందుకే ఇంకో రెండు రోజులుండి, ఈ కాఫీ యోగం అనుభవించండి"

"కుదరదన్నానుగా"

"మీకు కుదరకపోతే, నన్ను దీపావళి దాకా ఉండమంటోంది అమ్మ"

"ఎప్పటి దాకా?"

"దీపావళి దాకా"

"దీపావళి అంటే, ఇంకా ఎన్ని రోజులు?"

"ఎంత – ఇరవై రోజులు"

"ఇరవై రోజులు నిన్ను వదిలి నేనుండగలనా? నువ్వు నన్ను వదిలి ఉంటావా?"

"అమ్మ ఉండమంటోంది"

"నీ యిష్టం. నీకు ఉండాలనిపిస్తే నువ్వు ఉండు. నా కష్టం నేను పడతాను"

"మీరు కష్టపడాలని కాదు"

"కాదా. నువ్వు లేకపోతే నాకు కష్టం కాదూ?"

"భోజనానికి ఇబ్బంది అవుతుంది కదూ?"

"భోజనానికి కాదు – దానికేం – ఎక్కడో నాలుగు మెతుకులు కతికితే సరిపోతుంది. పెళ్ళికి ముందర అలవాటు లేదా ఏమిటి, హోటల్ భోజనం?"

"మరి ఇంక అవస్త ఏముంది?"

"ఆ మాత్రం తెలియదా? తెలిసే అడుగుతున్నావా?"

"తెలిస్తే ఎందుకడుగుతాను? తెలియకే అడుగుతున్నాను"

"నువ్వు లేకుండా నాకు ఒక్క క్షణం గడవదు. నీ ముద్దు మోము చూడకుండా నేనుండగలనా?"

"మీ మొద్దు మోము చూడకుండా నేనుండగలనా?"

"ఏమన్నావు?"

"మొద్దు మోము అన్నాను"

"నాది మొద్దు మోమా?"

"మీరెవరి వారు?"

"నీ వాణ్ణి"

"మీరు నా వారయతే, మీ మోము ఎవరిది?"

“నీదే”

“నా మోముని నేను ముద్దనుకుంటానా, మొద్దనుకుంటానా?”

“నీ నన్ను పంపించి, నువ్వు ఇక్కడ సుఖంగా ఉండగలవా?”

“ఉండలేను.”

“మరి ఉంటానని అన్నావు”

“అమ్మ అడిగింది కదా, అని”

“నీ యిష్టం – నీకు ఉండాలనిపిస్తే ఉండు”

“నా ఇష్టమైతే, మీతో వచ్చెయ్యాలనే. మీరు పక్కన లేకుంటే, నాకు తిండి సయిస్తుందా, నిద్ర పడుతుందా? అమ్మో – మీరు లేకుండా ఉండడమే”

“మరి ఎలా ఉంటావు?”

“ఉండలేను”

“అయితే, ఈ రోజు నాతో వచ్చేస్తావా?”

“వచ్చేస్తాను. ఈ కాఫీ కప్పు పెట్టేసి వస్తానుండండి”

❋ ❋ ❋

“ఏమ్మా, టిక్కెట్ కేన్సిల్ చేయించుకుంటావా?”

“నేను లేకుండా ఉండలేనన్నారమ్మా ఆయన”

“మగాళ్ళు అలానే అంటారమ్మా. పెళ్ళయిన కొత్తలో ఏ మగాడూ భార్య లేకుండా ఉండగలననడు”

“ఆయనే కాదు – నేనూ –”

“నువ్వూ ఉండలేవు. నాకు తెలియదూ? నేను ఉండగలిగానా? నువ్వూ అంతే. అప్పుడు నాకూ మా అమ్మా నాన్నల బాధ అర్థం కాలేదు”

“నాకు తెలుసునమ్మా. నేను వెళ్తే నువ్వు బాధపడతావని. నాకూ నీ దగ్గర కొన్నాళ్ళు ఉండాలనే ఉంది. ఆయన ఒక్కరూ ఉండాలని....”

“నాకు తెలియదా తల్లీ నీ బాధ”

“వారం రోజులవుతోంది వచ్చి. స్నేహితుల ఇంటికి వెళ్ళలేదు. వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళలేదు.”

“నువ్వు వచ్చినట్లు పూజారిగారికి తెలుసు కూడా.”

“గుడికెళ్ళి పూజ చేయించాలి. ఇంకొన్నాళ్ళు ఉంటే, స్నేహితులను కలవడం కూడా అవుతుంది. ఆదిలక్ష్మిని చూసి చాలా రోజులయింది. అది సీతాఫలాలు తెస్తుంది”

"ఈరోజు వెళ్ళిపోతుంటే చెప్పు, నాన్నగారిని పంపి సీతాఫలాలు తెప్పిస్తాను."

"వద్దమ్మా – పళ్ళు మా ఊళ్ళో దొరకవూ? ఆదిలక్ష్మి తెచ్చిన పళ్ళు తినాలనుంది. నేను తింటోంటే, దాని కళ్ళలో ఎంత ఆనందమో"

"దానికి నువ్వంటే ఎంతో ఆపేక్ష."

"శారద అమ్మగారు, నేను ఊరు వచ్చి, వాళ్ళింటికి వెళ్ళకుండా వెళ్ళిపోయానంటే బాధపడతారు"

"సరస్వతి వదినె బాధపడదూ?"

"ఏంటో, ఎవ్వరినీ కలవకుండా వెళ్ళిపోతున్నాను"

"అందుకే ఉండమంటున్నాను"

"నాకూ ఉండాలనే ఉంది"

"ఉండు తల్లీ! మళ్ళీ ఇప్పుడే వస్తావా ఏంటి? సంక్రాంతి దాకా రాకపోవచ్చు. ఇంక రెండు వారాలేగా దీపావళి. అంతవరకూ ఉండి వెళ్ళు"

"నాన్నగారి దగ్గర కూర్చుని మాట్లాడినట్లే లేదు. నాకూ కొన్నాళ్ళు ఉండాలనే ఉంది. ఉండు ఆయనకు చెప్పి వస్తాను"

❋ ❋ ❋

"అదేంటి, ఇప్పుడేగా ఈ రోజు నాతో వచ్చేస్తానన్నావు"

"కొన్నాళ్ళు ఉండి వస్తానండీ"

"ఎన్నాళ్ళు ఉన్నా అలానే అనిపిస్తుంది. దీపావళి తర్వాత మాత్రం రావాలని ఉంటుందా? ఇక్కడ ఉంటే నీకు బానే ఉంటుందేమో – నేను ఒక్కడినే ఉండాలి. నువ్వు లేకుండా నేను ఉండలేనని అంటున్నా, నీకు నా మీద జాలి కలగడం లేదు"

"అలా అనకండి"

"అలా కాక, ఇంకేమనమంటావు? పెళ్ళయినప్పట్నుంచి, ఒక్క రోజయినా నిన్ను వదిలి ఉన్నానా నేను? ఇప్పుడు ఎలా ఉండడం?"

"పోనీలెండి – వచ్చేస్తాను"

"నా కోసం నువ్వు వచ్చెయ్యక్కర్లేదు"

"మీ కోసం కాదు. నా కోసం – నేనూ మిమ్మల్ని వదిలి ఉండలేను. నేనూ వచ్చేస్తాను"

❋ ❋ ❋

"అదేంటి – ఇప్పుడేగా ఉంటానన్నావు?"

❋ ❋ ❋

"అదేంటీ – ఇప్పుడేగా వస్తానన్నావు?" ❋